# సింగిల్ పేజీ కథలు

## అతనికంటే ఘనుడు

'ఇక లాభం లేదు. ఊరుకుని ఉపయోగం లేదు. ఎంతకాలం ఇలా? మనిషికున్న నాలుగుదశల్లో ఒక్కోదశలో ఒక్కో అనుభవం! ఏ వయసుకు ఆ ముచ్చట అని పెద్దలు ఊరికే అన్నారా? పెద్దవాడు కదా అని నోరు మెదపకుండా వాడికి మర్యాద ఇస్తుంటే వాడు ఆ మర్యాదనేమైనా నిలుపుకున్నాడా? ప్రభుత్వశాఖలో ఇంజనీర్‌గా చేరి అయిదు సంవత్సరాలు అయిపోయింది. నా తర్వాత వాడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురం మూడేళ్ల ఆరుచేతులా సంపాదిస్తున్నాం. కానీ ఏమిటి లాభం? ఒక అందం లేదు, ఆనందం లేదు. ఒక్కటే రొటీన్ లైఫ్!

వాడు డాక్టరైనంత మాత్రాన విరాగైపోవాలా? దేశంలో ఎంతమంది డాక్టర్లు లేరు? ఇక ఊరుకుని లాభం లేదు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సరితను పెళ్లి చేసుకొని తీసుకొచ్చేయాలి. అప్పుడైనా వాడికి సిగ్గొస్తుందేమో!'

ముప్పై అయిదేళ్లొచ్చినా పెళ్లి చేసుకోని అన్నగార్ని అలవాటుగా తిట్టుకున్నాడు శంకర్!

* * *

ఆరోజు అందరూ ఆశ్చర్యపోయారు.

"చక్కగా బుద్ధిగా వుండే శంకర్ ఎంత పని చేశాడు?"

"ఇదేం పనిరా, అన్నయ్య పెళ్లి చేసుకోకుండా నువ్వు చేసుకోవడం ఏమిటి? చదువుకున్నావ్, ఎందుకు?" అని ఇంకా...పరువు, ప్రతిష్ట, సంఘం, సమాజం, ఇంగిత జ్ఞానం...ఇలాంటివాటి గురించి అరగంటసేపు అరచి అలసిపోయారు తల్లిదండ్రులు.

అన్నీ విని ఒక బారెడు నిట్టూర్పు విడిచి "ఉండమంటే ఇంట్లో ఉంటాను. పొమ్మంటే బయటికి పోతాను సరితతో. ఏం చెయ్యమంటారో చెప్పండి" అన్నాడు శంకర్.

తల్లిదండ్రులు, అన్నగారు ఏమీ మాట్లాడకపోవడంతో మౌనం సంపూర్ణాంగీకారం అనుకొని చక్కగా ఇంట్లోకి వెళ్లిపోయాడు శంకర్ సతీమణి సరితతో.

* * *

తమ్ముడ్ని, మరదల్ని, వాళ్ల సరదాల్ని, సంతోషాన్ని చూసి అదోలా ఫీలయ్యేవాడు ఆనంద్. వాళ్లిద్దరూ కలసి సినిమాకు బండిమీద వెళ్తుంటే ఏదోలా వుండేది ఆనంద్‌కి.

ఆనంద్ ప్రక్క గదిలోనే తమ్ముడు, మరదలి బెడ్రూం.



రాత్రుళ్లు వాళ్ల నవ్వులు, వినపించీ వినపించనట్టుండే మాటలు ఆనంద్ యవ్వనాన్ని పురికొల్పాయి.

ఆలస్యం చేయకుండా ఆనంద్ కూడా పెళ్లి చేసుకుంటానన్నాడు నెమ్మదిగా.

అతనిలో వచ్చిన మార్పుకు ఇంట్లోవాళ్లందరూ ఆశ్చర్యపోయి తెగ ఆనందపడిపోయారు. అర్జంటుగా ఓ అమ్మాయిని చూసి ఆ నెల్లోనే ఆనంద్ పెళ్లి నిశ్చయించేశారు.

ఆనంద్ పెళ్లిరోజు వచ్చేసింది.

రాత్రి ముహూర్తం. మధ్యాహ్నం భోజనాలు చేసి బంధువులందరూ పందిట్లో కూర్చున్నారు. స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ పందిట్లో ఒకచోట కూర్చున్నాడు ఆనంద్. శంకర్, తల్లిదండ్రులు పెళ్లి పనుల్లో హడావుడిగా వున్నారు.

అంతలో కొరియర్ అతను వచ్చి ఓ కవర్ అందించాడు ఆనంద్‌కి. అది అతని పేరనే వచ్చింది. ఆనంద్ గబగబా విప్పి చదవటం మొదలెట్టాడు.

"ఆనంద్ అన్నయ్యా, కంగ్రాట్యులేషన్స్!

శంకర్ అన్నయ్య తన పెళ్లి గురించి లెటర్ రాశాడు. ఇక్కడ చాలా బిజీగా వుండడం వల్ల జవాబు రాయలేకపోయాను. శంకర్‌ని ఏమీ అనుకోవద్దని చెప్పు.

నేను నీ పెళ్లికి కూడా రాలేకపోతున్నందుకు చాలా విచారిస్తున్నాను. కారణం ఏమిటంటే మృదులను ఆసుపత్రిలో జాయిన్ చేశాను. డెలివరీ టైం వచ్చేసింది. సారీ! అన్నట్టు నీకు మృదుల అంటే తెలియదు కదూ!? మృదుల, నేను ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నాం సంవత్సరంన్నర క్రితం. మీరేమంటారోనని భయం వేసి ఇంతవరకూ ఈ విషయాన్ని తెలియబరచలేదు. డెలివరీ అయిపోయాక మీరందరూ నన్ను మృదులతో రమ్మనమని వ్రాస్తే వస్తాము.

నాన్నగారు, అమ్మను, శంకర్ అన్నయ్యను, సరిత వదినను అడిగినట్టు చెప్పు. విష్ యు హ్యాపీ మేరీడ్ లైఫ్!- రమేష్.

ఉత్తరం చదవడం పూర్తిచేసి అలాగే వుండిపోయాడు ఆనంద్.

"ఎక్కడ్నుంచి వచ్చిందిరా ఉత్తరం?"

అప్పుడే వచ్చి అడుగుతున్న తండ్రికి సమాధానంగా...బెంగుళూరులో వుంటున్న తన రెండో తమ్ముడు రమేష్ రాసిన ఆ ఉత్తరాన్ని అందించాడు ఆనంద్.

**-ఎన్.బి.రామారావు**

## ఫలితం

శాంతికి మనసంతా పాడయింది. అత్తగారు అన్న మాటలు ఈటెల్లా తగులుతున్నాయి. ఎంత ఆలోచించినా తన తప్పేమిటో అర్థం కాలేదు. పెళ్లి చూపుల్లో "అమ్మాయి కుందనపు బొమ్మలా వుంది. డిగ్రీ చదివి, డిస్టింక్షన్‌లో పాసయ్యింది. సంగీతం, కుట్లు, అల్లికలు లాంటి అన్నింటిలో మంచి ప్రవేశం వుంది. పెళ్లి ఘనంగా చేయండి. కట్నం కూడా వద్దు" అన్న ఆవిడేనా ఈరోజు అంత మాటలు అన్నది. నాన్నగారు చెప్పినట్టుగానే భర్త చంద్రశేఖర్ కూడా తనని సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేర్ అవమని, ఏ చిన్నా చితక పనిలో చేరినా, పరీక్షల మీద ఏకాగ్రత కుదరదని ఉద్యోగంలో కూడా చేరనివ్వలేదు. నిన్న మొన్న వచ్చిన తన తోటికోడలు టీచరుగా ఉద్యోగంలో చేరి, అప్పుడే రెండునెలల జీతం కూడా అందుకుంది. మొదటిసారి పరీక్షలో మంచి మార్కులు రాకపోవడంతో మెయిన్స్‌కి అర్హత పొందలేకపోయింది. ఈసారి తప్పనిసరిగా మెయిన్స్‌లో సెలక్ట్ అయి శాంతి అంటే ఏమిటో